
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 7 మే 2024



పాలకులదే ఈ పాపం!

- అవస్థలు పెట్టేశావయ్యా జగన్
- పింఛన్‌దారుల ఆందోళన
- నేటికీ డబ్బులు అందుకోని దయనీయత
- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ
- ప్రభుత్వంపై తీవ్రంగా మండిపాటు

మెంటాడ/గజపతినగరం/భోగాపురం/గంట్యాడ, మే6:

పింఛన్ దారుల కష్టాలు తీరడం లేదు. భగభగమండుతున్న ఎండల్లో పింఛను డబ్బుల కోసం ఆపసోపాలు పడుతున్నారు. ఐదు రోజులైనా నేటికీ చాలా మంది పింఛను అందుకోలేకపోయారు. ఈనెల రెండో తేదీ నుంచి బ్యాంకులు పింఛన్‌దారులతో కిటకిటలాడుతున్నాయి. నడవలేని స్థితిలో సహాయకులతో బ్యాంకులకు వెళ్తే తమ బ్యాంకు ఖాతాలో డబ్బులు పడలేదని, వేరే బ్యాంకులో వాకబుచేయాలని సిబ్బంది చెబుతున్నారు. అమౌంట్ పడినా చాన్నాళ్లుగా ఖాతా నిర్వహణలో లేనందున, రెన్యూవల్ చేయించుకోవాలంటున్నారు. ఈ క్రమంలో వృద్ధులు, వికలాంగుల కష్టాలు వర్ణనాతీతం.


మెంటాడ: బ్యాంకులో వేచివున్న పింఛన్‌దారులు



గజపతినగరం: బ్యాంకు ముందు నిరీక్షిస్తున్న వృద్ధులు

మెంటాడలో యూనియన్ బ్యాంకులో డబ్బులు జమకాని వారిని విజయనగరం చిన్న వీధిలోని శాఖకు వెళ్లాలని చెప్తుండడంతో ఏం చేయాలో పాలుపోక పండుటాకులు విలవిల్లాడుతున్నారు. ఉసూరుమంటూ తిరిగి ఊరికి వెళ్లి సచివాలయ సిబ్బందిని కనుక్కొంటే తమకేంటి సంబంధం, ఏదో ఒక బ్యాంకులో సొమ్ము పడింటుందని ముక్తసరి సమాధానంతో తప్పించుకుంటున్నారు.

● జిల్లాలో 2,85,641 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరిలో వృద్ధులు 1,51,318 మంది, వితంతువులు 64,633, విభిన్న ప్రతిభావంతులు 37,671, అభయ హస్తం 10,406, ఒంటరి మహిళలు 5,231తో పాటు వివిధ కేటగిరికి చెందిన వారు కూడా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గత నెల గ్రామ సచివాలయం సిబ్బంది ద్వారా పింఛన్ దారులకు డబ్బులు పంపిణీ చేయగా, ఈనెల బ్యాంకు ఖాతాలకు జమ చేసే ప్రక్రియ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 2 లక్షలు 13 వేలు మందికి బ్యాంకు ఖాతాలకు జమ చేయగా, మిగిలిన వారికి నేరుగా డబ్బులు పింపిణీ చేశారు.

● ఇంటి వద్దకు పింఛన్ ఇవ్వలేకుంటే సచివాలయాల వద్ద ఇచ్చినా మాకు ఈ ఇబ్బందులు తప్పేవని, ఎండలో ఎన్ని తిప్పలు తెచ్చావయ్యా జగను అంటూ గజపతినగరం ఎస్‌బీఐ వద్దకు వచ్చిన వృద్ధులు సోమవారం గోడు వెళ్లబోసుకున్నారు. ఎండ దెబ్బ తగలకుండా చూసుకోవాలన్న ఆలోచనతో ఉదయం 9 గంటలకే వారంతా బ్యాంకు వద్దకు చేరుకున్నారు. వీరిలో రెండోసారి.. మూడోసారి వచ్చిన వారున్నారు. మొదటి రోజు జనం ఎక్కువగా ఉండడం చూసి ఎండలో క్యూలో ఉండలేక వెళ్లిపోయారు.

● భోగాపురం మండలంలో 22 పంచాయతీలు ఉండగా భోగాపురం, రాజాపులోవ గ్రామాల్లో మాత్రమే బ్యాంకులు ఉన్నాయి. అన్ని పంచాయతీల పింఛన్ దారులూ ఈ బ్యాంకుల వద్దకే రావాలి. చేపలకంచేరు, ముక్కాం, రెడ్డికంచేరు, బైరెడ్డి పాలెం, రామచంద్రపేట తదితర గ్రామాల నుంచి బ్యాంకుకు వచ్చి వెళ్లాలంటే రానుపోను రూ.100 ఆటోకు ఇవ్వాల్సిందే. వృద్ధులు ఐదు రోజులుగా బ్యాంకులకు తిరుగుతూనే ఉన్నారు. అయినా కాగితాలు కావాలంటూ కొందరని, తమ బ్యాంకుఖాతాలో డబ్బులు పడలేదని ఇంకొందరిని తిప్పిపంపుతున్నారు. విత్‌డ్రా ఫాం సరిగా రాసుకొని రావాలని కొందరు బ్యాంకర్లు చెబుతున్నారు.

చార్జీలు రూ.500 అయ్యాయి



మా గ్రామం నుంచి ఆటోపై బ్యాంకుకు వెళ్లాలి. రానుపోను రూ.100 తీసుకొంటున్నారు. ఐదు రోజులుగా ప్రతిరోజూ బ్యాంకుకు వెళ్లి వస్తున్నాను. పింఛను పడలేదంటున్నారు. డబ్బులు అందుతాయో లేదో తెలియదుగాని ఇప్పటివరకు చార్జీల కింద రూ.500 ఖర్చు అయింది.

-కోరాడ సన్యాసి, బైరెడ్డిపాలెం, భోగాపురం

బ్యాంకులకు తిరుగుతున్నా..



ఐదు రోజులుగా బ్యాంకులకు ఆటోపై వెళ్లి వస్తున్నాను. ఇంటి దగ్గర పనులు మానుకొని చార్జీలు భరిస్తూ తిరుగుతున్నా పనికావడం లేదు. ఏ బ్యాంకుకు వెళ్లినా డబ్బులు పడలేదంటున్నారు. మమ్మల్ని ఇలా తిప్పడం చాలా అన్యాయం. ప్రభుత్వం ఈవిధంగా ఇబ్బంది పెట్టకూడదు.

- ముగడ రామయ్యమ్మ, బైరెడ్డిపాలెం, భోగాపురం

డబ్బులు పడలేదంటున్నారు..



10 కిలోమీటర్లు దూరంలో నన్ను లోతుగెడ్డ గ్రామం నుంచి ఎన్నో కష్టాలు పడి కూతురు సహాయంతో ఇక్కడ బ్యాంకుకి వస్తే.. గజపతినగరం వెళ్లి వాకబు చేసుకోమంటున్నారు. అకౌంట్ ఇక్కడుందని సచివాలయ సిబ్బంది చెప్పి పంపారు. అక్కడికి వెళ్లమనడమేంటని అడిగితే ఇక్కడ ఖాతాల్లో డబ్బులు పడలేదని చెప్తున్నారు.

-మజ్జి గడ్డమ్మ, వృద్ధురాలు, లోతుగడ్డ గ్రామం, మెంటాడ

కళ్లు కనిపించవు.. కాళ్లు రావు



నాకు కళ్లు సరిగా కనిపించవు. కుటుంబ సభ్యులను తోడు తీసుకుని ఆంద్ర నుంచి వచ్చాను. మా ఊరు ఇక్కడికి పది మైళ్ల దూరం ఉంటాది. ఇక్కడి యూనియన్ బ్యాంకులో డబ్బు పడలేదట. విజయనగరం చిన్న వీధి యూనియన్ బ్యాంకులో కనుక్కోమంటున్నారు. కల్లులేవు. కాళ్లు రావు. నడవలేను. నేను ఎలా వెళ్లేది? ఇన్ని ఇబ్బందులు పెడుతున్నారు మాలాంటి వారి ఉసురు తగులుతుంది.

-పి.పాపమ్మ, ఆంద్ర గ్రామం, మెంటాడ

ఎత్తుగడ బెడిసికొట్టి..

పండుటాకుల పింఛన్ల ముసుగులో ఓట్లు దండుకోవాలని ప్రభుత్వం వేసిన ఎత్తుగడ చుట్టూ తిరిగి ఆ పార్టీ మెడకే చుట్టుకున్నట్టుందని వైసీపీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితులు వికటించడంతో ఆ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఇదంతా చంద్రబాబు వల్లే జరిగిందని నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అద్దుతగిలి 'మీ పన్నాగం మాకు అర్థమైందిలే, వారి మీద నెట్టకండి' అని ముఖంమీదే అనడంతో ఖంగు తినడం వైసీపీ నేతల వంతవుతోంది.

9న చంద్రబాబు రోడ్‌షో



టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

చీపురుపల్లి, మే 6: ఈ నెల 9న చీపురుపల్లిలో జరగనున్న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రోడ్ షోను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో మండల పరిషత్ కార్యాలయం వద్ద చంద్రబాబు రోడ్ షో నిర్వహించనున్న స్థలాన్ని ఆయన పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పి.శ్రీనివాసరెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం ఖాయమన్నారు. నాలుగు మండలాల్లోని పార్టీ శ్రేణులు, అభిమానులు చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.


నేడు లోకేశ్ యువగళం సభ



విజయనగరం, మే 6(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జిల్లాకు వస్తున్నారు. విజయనగరంలోని అయోధ్య మైదానంలో మంగళవారం మధ్యాహ్నం జరిగే యువగళం సభకు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున యువత, నిరుద్యోగులను ఆహ్వాని స్తున్నారు. మొదటి సారిగా ఓటు హక్కు వినియోగించు కుంటున్న ఓటర్లతో లోకేశ్ ముఖా ముఖీ మాట్లాడతారు. తొలుత వైసీపీ పాలనలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రసంగిస్తారు.

చేయూత లేనట్టే

- 1.43 లక్షల మందికి మొండిచేయి
- ఎన్నికల సంఘం ఆదేశాలతో ఆశలు ఆవిరి
- మార్చి 7న ఉత్తుత్తి బటన్ నొక్కుడు



మెంటాడ, మే 6: ముఖ్యమంత్రి జగన్ వైఎస్ఆర్ చేయూత కింద బటన్ నొక్కి దాదాపుగా 70 రోజులైంది. ఒక్కరి ఖాతాలో కూడా డబ్బులు జమకాలేదు. మార్చి 7న బటన్ నొక్కి వారం రోజుల్లో అక్కచెల్లెమ్మల ఖాతాల్లో డబ్బులు పడతాయని గొప్పగా ప్రకటించారు. జిల్లాకు సంబంధించి 1.43 లక్షల మందికి రూ. 268 కోట్లు మేర లబ్ధి కలుగుతుందని ఆదేరోజు జిల్లా అధికారులు సెలవిచ్చారు. నేటికీ సొమ్ములు జమకాలేదు.

● అసలు కథేంటంటే.. నిధుల విడుదలకు ముందు ఆర్థిక శాఖ నుంచి బడ్జెట్ రిలీజింగ్ ఆర్డర్ జారీ చేయాలి. తర్వాత బటన్ నొక్కితే ఆయన చెప్పిన రోజుకు కాస్త అటుఇటుగా నైనా బ్యాంకు ఖాతాల్లో జమయ్యేవి. కానీ బీఆర్వో లేకుండానే ఉత్తుత్తి బటన్ నొక్కి ఆ తర్వాత అప్పు పుట్టాక తీరిగ్గా మార్చి చివరిలో బీఆర్వో జారీ చేయించుకోవాలనుకున్నారు. ఈలోపు ఆర్థిక సంవత్సరం ముగిసి సదరు బీఆర్వో కాలదోషం పట్టి మురిగిపోయింది. దీంతో చేయూతకు గ్రహణం పట్టిందని విశ్వసనీయ అధికార వర్గాల సమాచారం. అంటే...మార్చి 7న ముఖ్యమంత్రి నొక్కింది ఉత్తుత్తి బటన్ నొక్కుడని తేటతెల్లమైంది.

● సోమవారం రాత్రి చోటుచేసుకున్న పరిణామాలతో చేయూత హుళక్కేనని తేలిపోయింది. పథకాలకు ఎన్నికలు పూర్తయ్యేవరకు నిధులు విడుదల చేయొద్దని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎప్పుడో ఎనిమిది నెలల క్రితం నాటి తుఫాను బాధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈమేరకు ఆదేశాలు జారీచేసింది. అప్పటి తుఫానుకు ఈ ఎన్నికలకు వారం ముందు నిధుల విడుదలకు ప్రతిపాదనలు పంపడమేంటని ప్రశ్నించింది. ఇతర పథకాల నిధులు విడుదలకూ ఇది వర్తిస్తుందని అందులో స్పష్టం చేసింది.




విజయనగరంలో ఫెసిలిటేషన్ సెంటర్‌కు సమీపంలో వైసీపీ గుర్తుతో ఓటు అడుగుతున్న దృశ్యం


ఎస్.కోట ఫెసిలిటేషన్ సెంటర్‌లో కూర్చొన్న ఎంపీపీ, జడ్పీటీసీలు, (ఇన్‌సెట్‌లో) ఎమ్మెల్యే



ప్రలోభాల్లోనే..

- పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల సమీపంలో వైసీపీ శ్రేణులు
- ప్రతి ఉద్యోగితో మాట్లాడే ప్రయత్నం
- ఎస్.కోట ఫెసిలిటేషన్ సెంటర్ వద్దకు ప్రజాప్రతినిధులు కూడా
- విజయనగరంలో గుర్తులు చూపుతూ..

శృంగవరపుకోట, మే 6: పోస్టల్ బ్యాలెట్ నుంచే వైసీపీ ప్రలోభాలను మొదలు పెట్టేసింది. ఫెసిలిటేషన్ కేంద్రాల వద్దకు జాతరలా ఆ పార్టీ శ్రేణులు, నేతలు క్యూ కడుతున్నారు. ప్రతి ఉద్యోగితోనూ మాట్లాడుతున్నారు. శృంగవరపుకోట ఫెసిలిటేషన్ సెంటర్ సోమవారం వైసీపీ నాయకులతో కోలాహలంగా కనిపించింది. పోస్టల్ ఓటేసేందుకు వచ్చిన ఉద్యోగులను ఏదో రకంగా కలిసి మాట్లాడేందుకు వారంతా ప్రయత్నించారు. ఏకంగా ఫెసిలిటేషన్ సెంటర్‌లో అధికార పార్టీ ఎంపీపీ, జడ్పీటీసీలు తిష్ఠవేశారు. అంతేకాకుండా పోలింగ్ బూత్ ఎదురుగా వున్న విశాఖ-అరకు రోడ్డులో ఎక్కడ చూసిన వైసీపీ నాయకులు, కార్యకర్తలే కనిపించారు. విజయనగరంలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అక్కడ ఏకంగా ఆ పార్టీ గుర్తునే చూపెడుతూ ఓటు అభ్యర్థించారు.

ఎస్.కోట నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొనున్న ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ)లు పోస్టల్ ఓటేసేందుకు ఆదివారం ఎస్.కోటలోని ఫెసిలిటేషన్ సెంటర్‌కు వచ్చారు. వారంతా ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు. వారికి బిర్యానీ ప్యాకెట్‌లను రహస్యంగా అందించారు. అడిగిన వారికి మద్యం కూడా ఇచ్చినట్లు సమాచారం. గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ ఉద్యోగులు కూడా ఓటేసేందుకు వచ్చారు. సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు క్షేత్ర స్థాయిలో ఎక్కడికక్కడ అల్టీమేటం జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. 'మన ప్రభుత్వమే ఉద్యోగాలిచ్చింది.. ప్రభుత్వానికి తప్పక మద్దతు తెలపాలి' అంటూ ఆదేశాలిచ్చారట. వారి ఓట్లన్నీ తమ వైపు తిప్పుకొనే ఒదుకు ఏకంగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీలు), జిల్లా ప్రజా పరిషత్ సభ్యులు (జడ్పీటీసీ)లు ఫెసిలిటేషన్ సెంటర్‌లో సోమవారం తిష్ఠవేశారు. పోలింగ్ బూత్ ఎదురుగా కూర్చొన్నారు. ఉద్యోగులను పలకరించడం, ఓటేసి వచ్చేవారి ముఖకవలికలను పరిశీలించడం చేశారు. దీంతో ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. మాట్లాడలేక.. ఊరుకోలేక లోలోపల మథనపడ్డారు. అంతకు ముందే ఫెసిలిటేషన్ సెంటర్‌కు ఎదురుగా వున్న విశాఖ-అరకు రోడ్డులో వైసీపీ గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కాపుకాసారు. ఓటేసేందుకు వచ్చిన ఉద్యోగుల వద్దకు వచ్చి పార్టీ గుర్తుకు ఓటెయ్యాలంటూ అడగడంతో పాటు గేటు వరకు సాగనంపడం చేశారు. కాగా ఫెసిలిటేషన్ సెంటర్‌లో నేతలు ఉండడంపై రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణను వివరణ కోరగా పోస్టల్ ఓటింగ్‌కు వారంతా ఏజెంట్లుగా వచ్చినట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు ఎవరిని ఏజెంట్లుగా నియమించినా ఆమోదిస్తామన్నారు.

విజయనగరంలో..

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ సమీపంలో అధికార పార్టీ భిన్నంగా ప్రచారం చేసింది. ఫ్యాన్ గుర్తును చూపి వాటర్, మజ్జిగ ప్యాకెట్లు అందించి ప్రలోభాలు చేస్తున్న పరిస్థితి సోమవారం జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం వద్ద కనిపించింది. టీడీపీ శిబిరంలో కేవలం వాటర్, మజ్జిగ ప్యాకెట్లు అందించారు.



రెండో రోజున 7,044 పోస్టల్ బ్యాలెట్లు

విజయనగరం(ఆంధ్రజ్యోతి)/ కలెక్టరేట్, మే6: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి రెండో రోజు 6005 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాలకు చెందిన 1039 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వేశారు. నియోజకవర్గాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లోనూ పోస్టల్ బ్యాలెట్ వేయడానికి ఉద్యోగులు క్యూ కట్టారు. కాగా ఈనెల 7,8 తేదీల్లో కూడా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. రెండోరోజు సోమవారం రాజాం నియోజకవర్గం నుంచి 775, చీపురుపల్లి నుంచి 697, గజపతినగరం నుంచి 794, నెల్లిమర్ల నుంచి 660, విజయనగరం నుంచి 1449, బొబ్బిలి నుంచి 843, ఎస్.కోట నుంచి 787 మంది ఉద్యోగులు ఓటు వేశారు. కాగా పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఉద్యోగులు మండుటెండను సైతం లెక్కచేయడం లేదు. పిల్లలతోనూ క్యూలో నిల్చొంటున్నారు. విజయనగరంలోని జేఎన్టీయూ ప్రాంగణంలో ఈ దృశ్యాలు కనిపించాయి.

భళా.. మహిళ

- స్వీప్ ర్యాలీలో అధికంగా పాల్గొన్న మహిళలు

కలెక్టరేట్, మే 6: స్వీప్ కార్యక్రమంలో భాగంగా విజయనగరంలో మహిళలు సోమవారం భారీ ర్యాలీ చేశారు. కోట జంక్షన్‌లో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్లా ఈ ర్యాలీని ప్రారంభించారు. కోట జంక్షన్ నుంచి సింగపూర్ సిటీ వరకూ రెండు కిలోమీటర్ల పరిధిలో ర్యాలీ జరిగింది. దాసన్నపేట జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసరావు, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



పీపుల్స్ మేనిఫెస్టో

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి



సాలూరు రూరల్: ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి. గతంలో లేని విధంగా ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడి గురవుతున్నారు. అనవసర యాప్‌లతో సతమతమవుతున్నారు. ఆన్‌లైన్ ట్రైనింగ్‌లంటూ ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఉపాధ్యాయుల పనితీరు బాగుందనడానికి గత రెండేళ్లుగా పదో తరగతిలో రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ స్థానంలో ఉండడమే తార్కాణం. ఉపాధ్యాయులు తమ పని తాము చేసుకుంటున్నా... వివిధ బృందాలతో తనిఖీ... పరిశీలనల పేరుతో రంధ్రాన్వేషణే ధ్యేయంగా ఒత్తిడి చేస్తున్నారు. ఒత్తిడి తగ్గించి జిల్లాలో విద్యాభివృద్ధి జరిగేలా ప్రోత్సహించాలి.

- నల్లా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి, ఏపీటీఎఫ్ 257, పార్వతీపురం మన్యం జిల్లా



పోలీసైనా.. నో ఎంట్రీ..

(చీపురుపల్లి)

పోలింగ్ రోజున పోలీసులకు సైతం పోలింగ్ బూత్‌లోకి అడుగు పెట్టేందుకు అనుమతి ఉండదు. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే తప్ప వారు లోపలికి వెళ్లకూడదు. అప్పుడు కూడా ప్రిసైడింగ్ అధికారి ఆదేశాల మేరకు మాత్రమే వారు లోపలికి వెళ్లాలి. పోలింగ్ జరుగుతున్నంత సేపు వారు బయట మాత్రమే విధులు నిర్వహించాల్సి ఉంటుంది. పోటీ చేసే అభ్యర్థికి జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్నా... ఆయన వెంట ఉండే రక్షణ సిబ్బందికి కూడా లోపలికి అనుమతి లేదు. అభ్యర్థితో పాటు మఫ్టీలో ఉన్న ఒక్కరికి మాత్రమే అనుమతి ఉంటుంది. భద్రతా సిబ్బంది అంతా బూత్ బయటే ఉండాలి. ఎన్నికల అధికారి ప్రత్యేక అనుమతి ఉంటే లోపలికి వెళ్లొచ్చు.



డీజేలు.. డప్పులు

● ప్రచారంతో హోరెత్తుతున్న గ్రామాలు.. పట్టణాలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి)

మారుతున్న కాలానికి అనుగుణంగా ఎన్నికల ప్రచారం కూడా కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రచార వ్యయం రాను, రాను పెరుగుతూ పోతోంది. ఇప్పుడు ప్రచారం డీజెలు, థాసా డప్పులతో హోరెత్తుతోంది. భారీ సౌండ్ స్పీకర్లతో ప్రచారం సాగుతోంది. థాసా డప్పులు కూడా హోరెత్తిస్తున్నాయి. వీటితో పాటు సామాజిక మధ్యమాలు వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర వాటితో పాటు ఐవీఆర్ కాల్స్ కూడా చేస్తున్నారు. నాయకుడు వచ్చినప్పుడు వీధులు, గ్రామాలు, పట్టణాల్లో భారీ ఎత్తున బాణసంచా కాల్చుతున్నారు. ఇవి ఒక్కోసారి హద్దు దాటుతుండడం గమనార్హం. మరికొన్ని చోట్ల ఓటర్లకు మద్యం, నగదు, బంగారం, వెండి వస్తువులతో పాటు యువకులకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్నారు. ఈ పంపిణీ కార్యక్రమం ఒకప్పుడు ప్రత్యేకంగా జరిగేది. ఇప్పుడు ప్రచారంలో భాగంగానే కానిచ్చేస్తున్నారు.

జగన్నాటకం!



ఈ పెంకుటింటిలోనే నివాసం ఉంటున్న చుక్క అప్పారావు కుటుంబం



● ఇవ్వనిది ఇచ్చినట్టు.. కరపత్రాలతో కనికట్టు
● కొవిడ్ సాయం అందించినట్టు ప్రచారం
● ఇల్లు ఇవ్వకున్నా రూ.2.50 లక్షల లబ్ధి చేకూరిందట
● వైఎస్ఆర్ ఆసరా ఇవ్వకున్నా.. ఇచ్చినట్టు కహానీ
● వైసీపీ నేతల పచ్చి అబద్ధాలు
● అవాక్కవుతున్న ప్రజలు

(మెంటాడ)

వైసీపీ నేతలు తాజాగా తెరతీసిన కొత్త నాటకం తిరిగి వారి మెడకే చుట్టుకుంటోంది. వారు ఇంటింటా పంపిణీ చేస్తున్న కరపత్రాలు అసలుకే ఎసరు తెస్తుండడం కొత్త తలనొప్పులు తెస్తోంది. వారు స్వహస్తాలతో పంపిణీ చేస్తున్న కరపత్రాలే ఆత్మరక్షణలోకి నెట్టేస్తుండడంతో కార్యకర్తలు, నాయకులు పార్టీ కరపత్రాలు అంటే భయపడుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, అధికార పార్టీ నేతలు గతంలో గడపగడపకూ వైసీపీ పేరుతో ఇంటింటా పంచిన కరపత్రాలు ఇప్పుడు మళ్లీ వార్డులవారీగా ఆ పార్టీ నేతలు పంపిణీ చేయిస్తున్నారు. మీ ఇంటికి ఇంత లబ్ధి చేకూరిందని గొప్పలకు పోతున్నారు. మీ ఓటు మాకే వెయ్యాలంటూ హుకుం జారీ చేసినంత పనిచేస్తున్నారు. తీరా అందులోని వివరాలు చూసి ప్రజలు అవాక్కవుతున్నారు. కొవిడ్ సాయం ఇవ్వకున్నా ప్రతి ఇంటికీ ఇచ్చినట్టు చూపారు. ఇల్లు మంజురు చేయకున్నా చేసినట్టు, చేయూత, ఆసరా ఇవ్వకపోయినా ఇచ్చేసినట్టు.. ఇలా ఒకటా రెండా అన్నీ అబద్ధాలే ఆ కరపత్రాల్లో దర్శనమివ్వడంతో విస్తుపోతున్నారు. అంతా జగన్మాయ అంటూ నిట్టూర్చుతున్నారు.

కొవిడ్ సాయమా.. అదెక్కడ?


ఇంటింటికి పంచిన కరపత్రాల్లో కొవిడ్ సాయం కింద ప్రభుత్వం రూ.వెయ్యి వంతున ఇచ్చినట్టు ఉండడంతో షాక్‌కు గురవడం ప్రజల వంతు అవుతోంది. కరోనా సమయంలో ఎటువంటి సాయం చేయని ప్రభుత్వం వెయ్యేసి రూపాయలు చొప్పున ఇచ్చినట్టు గొప్పలు చెప్పుకోవడంపై వారు మండిపడుతున్నారు.

ఇల్లే లేదు.. బిల్లు ఏంటి?

పిట్టాడ గ్రామంలో కొన్ని ఇళ్లకు ఇచ్చిన కరపత్రాల్లో ఇల్లు రూపంలో రెండున్నర లక్షల రూపాయల లబ్ధి కలిగినట్టు ఉంది. దీన్ని చూసి జనం విస్తుపోతున్నారు. నాలుగేళ్లుగా ఇల్లే లేదని మొత్తుకున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పూరిగుడిసెల్లోనే మగ్గుతున్నామని... మాకు ఇంటి బిల్లు పేరుతో రెండున్నర లక్షలు ఇచ్చినట్టు తప్పుడు ప్రచారం ఏంటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. వైఎస్ఆర్ చేయూత మంజురు కాకపోయినా రూ.18,750 అందినట్టు ముద్రించారు. ఇదేంటని నిలదీస్తే ఎన్నికల సమయానికి అకౌంట్‌లో వేస్తారని నమ్మబలుకుతున్నారు. ఇల్లు కట్టలేదు బిల్లు ఇవ్వడమేమిటని అడిగితే.. ఇల్లు మంజూరైంది. కట్టుకోండి డబ్బులు వేసేస్తాం అంటూ వైసీపీ నేతలు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

జేవీడీ వంచన

జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ఒకట్రెండు వాయిదాలు ఎగ్గొట్టి మొత్తం అన్ని విడతల సాయం ఇచ్చినట్టు కరపత్రాల్లో చూపడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేమని నిలదీస్తే సమాధానం దాటవేయడం వైసీపీ నాయకుల వంతైంది. చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి, పింఛన్ ఇవ్వకుండానే ఇచ్చినట్టు, రైతుభరోసా అందకున్నా మంజూరు చేసినట్టు.. ఎన్నెన్నో సిత్రాలు వెలుగు చూస్తున్నాయి.



లబ్ధి పొందిన వివరాలతో వైసీపీ నేతలు అందిస్తున్న కరపత్రం

శిథిలావస్థలో ఉన్న పెంకుటిల్లే దిక్కు

ఇల్లు మంజూరు చేయాలని నాలుగేళ్లుగా నాయకులు, అధికారుల చుట్టూ తిరిగాను. ఎవరూ పట్టించుకోలేదు. శిథిలావస్థకు చేరిన పెంకుటింటిలోనే ఉంటున్నాను. వైసీపీ నేతలు నా చేతిలో ఏదో పేపర్ పెట్టి నీకు ముఖ్యమంత్రి జగన్ ఇంటి నిర్మాణానికి రెండున్నర లక్షల రూపాయలు ఇచ్చారని చెబుతున్నారు. ఇల్లు ఇవ్వలేదని చెబితే... పాంప్లెట్‌లో ఉందంటే ఇచ్చినట్టే, ఇల్లు కట్టుకో బిల్లు ఇచ్చేస్తాం అంటున్నారు. ఎవరడిగినా అలాగే చెప్పు అని వెళ్లిపోయారు.

- చుక్క అప్పారావు, పిట్టాడ

వైఎస్ఆర్ చేయూత అందలేదు

వైఎస్ఆర్ చేయూత రూ.18,750 లబ్ధి చేకూరినట్లు పాంప్లెట్‌లో ఉంది. నాకు ఇంతవరకు ఆసరా మంజూరైనట్టు తెలియదు. ఎవరూ చెప్పలేదు. పాంప్లేట్‌లో ఇచ్చినట్టు చూపుతున్నారు. అడిగితే నెలాఖరు నాటికి డబ్బులు పడతాయని అంటున్నారు. ఎన్నికల కోడ్ ఉంది. కొత్తగా చేయూత ఎలా మంజూరు చేస్తారో చూడాలి.

- గండి శ్రీ దేవి, పిట్టాడ

కొవిడ్ సాయం ఎప్పుడిచ్చారో?

మా కుటుంబాలకు కొవిడ్ సాయం కింద వెయ్యేసి రూపాయలు ఇచ్చినట్టు కరపత్రాల్లో చూసి ఆశ్చర్యపోతున్నాం. ఇంత దారుణంగా అబద్ధాలు చెప్పడం ఏంటి? నిజంగా ప్రభుత్వం ఇస్తే ఆ డబ్బులు ఎవరు స్వాహా చేశారో తేలాలి.

- డోకలి అప్పలనాయుడు, పిట్టాడ

పార్వతీపురాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తా
● విద్యాభివృద్ధికి ప్రాధాన్యం
● వంద రోజుల్లో సీతానగరం వంతెన పూర్తి
● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర

(పార్వతీపురం, ఆంధ్రజ్యోతి)

'కూటమి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సీతానగరం వంతెన పూర్తి చేయిస్తా. అభివృద్ధి కార్యక్రమాల్లో నియోజకవర్గాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా' అంటున్నారు పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రణాళిక ప్రకారం..

నేను ఎమ్మెల్యేగా గెలిస్తే.. ప్రణాళిక ప్రకారం పార్వతీపురం నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తాను. సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కాలువల అనుసంధానానికి చర్యలు తీసుకుంటాను. అడారి గెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తాం. జంఝావతి హైలెవల్ కెనాల్ పనులు పూర్తి చేయిస్తాం. కాలువల ద్వారా సమీప ప్రాంతాల్లో గల చెరువుల్లోకి నీటిని మళ్లించి సాధ్యమైనంత వరకు ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం.

తాగునీటి సమస్యకు ఇలా..

తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాను. కేంద్ర ప్రభుత్వం ఇంటింటికీ కొళాయి పథకానికి ఆర్థిక సాయం చేస్తూ నిధులు అందిస్తున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఆ పనులు పూర్తి కావడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటింటికీ కొళాయి పథకాన్ని ప్రతి గ్రామంలో పూర్తి చేయిస్తా. ప్రత్యేక నిధులు మంజూరు చేయించి తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాను. జిల్లా కేంద్రానికి అవసరమైతే జంఝావతి ప్రాజెక్టు ద్వారా తాగునీరు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాను.

పూర్తి స్థాయిలో వైద్య సేవలు

వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటాను. జిల్లా కేంద్రంలో సూపర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేయిస్తాను. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందిస్తాం. రిఫరల్ అన్నది లేకుండా పార్వతీపురం కేంద్రంగా రోగులకు అవసరమైన వైద్యసేవలను అందించేలా ప్రతి విభాగానికీ వైద్య నిపుణులను నియమిస్తాం. పార్వతీపురం మన్యం జిల్లాకు వైద్య కళాశాల తీసుకొస్తాం. జిల్లా కేంద్ర ఆసుపత్రికి అనుసంధానంగా కళాశాల ఉంటుంది. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తాం. ఈ ప్రాంత విద్యార్థినులకు స్థానికంగా ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ, నర్సింగ్ తదితర కోర్సులు అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటా.

విద్యాభివృద్ధికి...

పార్వతీపురంలో అనేకమంది డిగ్రీతోనే తమ చదువులను నిలిపేస్తున్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తాను. విద్య పూర్తయిన తర్వాత ఉపాధి లభించేవిధంగా చర్యలు తీసుకుంటా. జిల్లా కేంద్రంలో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటా. మహిళలకు ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు అందించి ఉపాధి కల్పిస్తాం.

రవాణా సౌకర్యాలపై...

ప్రతి గ్రామానికీ రహదారి.. రవాణా సదుపాయం ఉండాలి. ఈ రెండూ ఉన్నప్పుడు ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. 24 గంటలూ పల్లెలకు రవాణా సదుపాయం ఉండే విధంగా చర్యలు తీసుకుంటాను. ఆర్టీసీ సేవలు ప్రతి గ్రామానికీ విస్తరించే విధంగా కృషి చేస్తా.



పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి విజయచంద్ర

ఆ ఇద్దరికీ రుణపడి ఉంటా

నా ప్రాణం ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు రుణపడి ఉంటా. ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని నాకు కల్పించారు. నియోజకవర్గ ప్రజలతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నా విజయం కోసం ఎంతో శ్రమిస్తున్నారు. మొదటి ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నాను. రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎంతో కష్టపడుతున్నారు. జిల్లాలోనే పార్వతీపురం నియోజవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా.

అందుబాటులో ఉంటా...

ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇస్తే.. ప్రజలకు అంకితభావంతో సేవలు చేస్తా. ఏ సమస్య వచ్చినా ప్రజలకు అండగా ఉంటాను. 24 గంటలూ ఏ సమయంలోనైనా నా దగ్గరకు రావచ్చు.

వంద రోజుల్లో వంతెన

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో సీతానగరం వంతెన పూర్తి చేయించి ప్రజలకు అంకితం చేస్తాను. పాత వంతెన మరమ్మతుల పేరిట వైసీపీ సర్కారు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టింది. ఈ మొత్తాన్ని కొత్త వంతెనపై ఖర్చు చేస్తే బాగుండేది. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వంద రోజుల్లో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయిస్తా. లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారాన్ని తిరిగి తెరిపిస్తా. చెరకు రైతులకు పూర్వ వైభవం తీసుకొస్తాం. గతంలో పనిచేసిన కార్మికులతో పాటు కొత్త వారికి కూడా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటా.

గంట్యాడ నుంచి నలుగురు ఎమ్మెల్యే అభ్యర్థులు

● ఇద్దరు ఎంపీ అభ్యర్థులు



కుమార్‌రాజా



కిలారి అప్పలనాయుడు



ములగాడ దుర్గారావు



బొబ్బిలి శ్రీనివాసరావు



కొండపల్లి శ్రీనివాస్

(గంట్యాడ)

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో గంట్యాడ మండలం నుంచి నలుగురు ఎమ్మెల్యే అభ్యర్థులు... ఇద్దరు ఎంపీ అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ప్రధాన పార్టీలతో పాటు, స్వతంత్రంగా పోటీ చేస్తున్న వారు ఉన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఎక్కువ మంది పోటీ చేయడం వివిధ గ్రామాల్లో చర్చనీయాంశమైంది. సాధారణ రైతు, నిరుపేద కుంటుబాలకు చెందిన వారు బరిలో దిగారు. మండలంలోని గొడియాడ గ్రామానికి చెందిన బొబ్బిలి శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీ నుంచి విజయనగరం పార్లమెంట్ స్థానానికి ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. దీంతో తన స్థాయిలో ప్రచారం చేసుకుంటున్నారు. రావివలస గ్రామానికి చెందిన సియ్యాదులు ఎల్లారావు విజయనగరం పార్లమెంట్‌కు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇది ఇలా ఉంటే గజపతినగరం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ మండల కేంద్రమైన గంట్యాడ గ్రామానికి చెందిన వారనే సంగతి తెలిసిందే. అలాగే ఇదే నియోజకవర్గంలోని లక్కిడాం గ్రామానికి చెందిన కిలపర్తి కుమార్ రాజ్ సమాజ్ వాదీ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. గజపతినగరం నియోజకవర్గం నుంచి గింజేరు గ్రామానికి చెందిన కిలారి అప్పలనాయుడు అనే నిరుద్యోగి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. గత ఐదేళ్ల కాలంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయలేదని, తమకు నిరుద్యోగులంతా అండగా ఉన్నారని చెబుతున్నారు. ఇదే నియోజకవర్గంలోని కొటారుబిల్లి గ్రామానికి చెందిన ములగాడ దుర్గారావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ఆయన ప్రసుత్తం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. తనకు ఆటో డ్రైవర్లు అంతా మద్దతుగా ఉన్నారని చెబుతున్నారు. మండలానికి చెందిన ఆరుగురు అభ్యర్థులు బరిలో ఉండటం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

ఎన్నికల ప్రచారంలో అదితి, విద్యావతి

● దూసుకుపోతున్న అక్కాచెల్లెళ్లు

విజయనగరం, (ఆంధ్రజ్యోతి), మే 6: విజయనగరంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న అదితి గజపతిరాజుకి మద్దతుగా కుటుంబ సభ్యులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతి రాజు ముఖ్యకూడళ్లలో ప్రచార సభల్లో పాల్గొనగా... తాజాగా అదితి గజపతిరాజు సోదరి విద్యావతీ దేవి కూడా ప్రచారాన్ని ప్రారంభించారు. విజయనగరం నియోజకవర్గం టీడీపీకి ప్రతిష్ఠాత్మకం కావడంతో వీరు ముగ్గురూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. అదితి గజపతిరాజు తన ప్రసంగాల్లో అశోక్ గజపతిరాజు విజయనగరం నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని వివరిస్తుండగా... అశోక్ గజపతిరాజు కూడా టీడీపీ హయాంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నారు. అదితి సోదరి డాక్టర్ విద్యావతీ దేవి కూడా తన తండ్రి అశోక్ చేసిన అభివృద్ధినే ప్రజలకు గుర్తు చేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలు, వైసీపీ దురాగతాలను జనాలకు తెలియజేస్తున్నారు.



ప్రచారంలో పాల్గొన్న విద్యావతీ దేవి




ప్రచారంలో అదితికి హారతులు ఇస్తున్న మహిళలు

వారసులకు రెండుసార్లే టిక్కెట్

● 1967లో రామారావు.. 2019లో కిమిడి నాగార్జునకు అవకాశం

(చీపురుపల్లి)

సుమారు 72 ఏళ్ల చరిత్ర కలిగిన చీపురుపల్లి నియోజకవర్గంలో రాజకీయ వారసులకు కేవలం రెండు సార్లే టిక్కెట్లు దక్కాయి. ఇప్పటి వరకూ జరిగిన 15 అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో వారసులకు ప్రాధాన్యం దక్కలేదు. 1962లో ఈ నియోజకవర్గంలో వారసత్వ పరంగా పార్టీ టికెట్ కేటాయింపు జరగగా.. 52 సంవత్సరాల తరువాత మళ్లీ 2019లో మరోసారి రాజకీయ వారసత్వానికి టికెట్ దక్కింది. అంటే ఏడు దశాబ్దాల నియోజకవర్గ చరిత్రలో ఒకే కుటుంబానికి చెందిన వారికి రెండుసార్లు టికెట్లు ఇవ్వడానికి ఏ రాజకీయ పార్టీ ముందుకు రాలేదన్నమాట. 1962లో వారసత్వ పరంగా తాడ్డె రామారావుకు భారత జాతీయ కాంగ్రెస్ తరపున ఆ అవకాశం లభించింది. 2019 ఎన్నికల్లో కిమిడి నాగార్జునకు తెలుగుదేశం పార్టీ ఆ అదృష్టాన్ని కల్పించింది. 1952లో ఏర్పాటైన చీపురుపల్లి నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యేగా తాడ్డె అచ్చిన్నాయుడు ఎన్నికయ్యారు. అప్పట్లో ఆయన మూడేళ్ల మాత్రమే పదవిలో ఉండగలిగారు. ఆ తరువాత 1955లో జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీ కూడా ఆయనకు గానీ.. ఆయన వారసులకు గానీ తిరిగి టికెట్ కేటాయించలేదు. ఆ ఎన్నికల్లో ముదుండి సత్యనారాయణరాజు.. 1962లో కోట్ల సన్యాసప్పలనాయుడులు ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. ఆ తరువాత 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు చిన అచ్చిన్నాయుడు కుమారుడు తాడ్డె రామారావు వారసత్వ కోటాలో టికెట్ పొందిన మొదటి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అప్పట్లో ఆయన విజయం సాధించారు. ఆ తరువాత ఎవరికీ మళ్లీ వారసత్వ కోటాలో టికెట్ రాలేదు. 2014లో చీపురుపల్లిలో కిమిడి మృణాళినికి టిక్కెట్ ఇచ్చిన తెలుగుదేశం పార్టీ... 2019లో ఆమె కుమారుడు నాగార్జునకు అవకాశం కల్పించింది. దీంతో వారసత్వపరంగా టికెట్ పొందిన రెండో వ్యక్తిగా నాగార్జున నియోజకవర్గ చరిత్రలో రికార్డులకెక్కారు. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో అదే కుటుంబానికి చెందిన మాజీ మంత్రి, తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు, నాగార్జునకు స్వయానా పెదనాన్న అయిన కిమిడి కళావెంకటరావు పోటీ చేస్తున్నారు.



తాడ్డె రామారావు



కిమిడి నాగార్జున

జన కేతనం
ఆంధ్రజ్యోతి
మంగళవారం 7 మే 2024



విజయనగరంలోని పోలింగ్ కేంద్రం వద్ద..

రెండో రోజూ ఉత్సాహంగా..

- పోస్టల్ బ్యాలెట్ వినియోగం
- భారీగా పోలింగ్

సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, ఉద్యోగులు రెండో రోజైన సోమవారం కూడా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించారు.

మరో 660 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

నెల్లిమర్ల, మే 6: స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో రెండో రోజు సోమవారం 660 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారు 1906 మంది. తొలిరోజు 587 మంది, రెండో రోజు 660 మంది మొత్తం 1247 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇంకా ఓటు వేసేందుకు రెండు రోజుల గడువు ఉంది. ఈ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, రెడ్డి వేణు తదితరులు సందర్శించారు.



హెల్ప్ డెస్క్ వద్ద పోలింగ్ బూత్ వివరాలు ఆరా తీస్తున్న ఉద్యోగులు

బొబ్బిలిలో 843 ఓట్లు

- భారీగా మోహరించిన పోలీసు బలగాలు

బొబ్బిలి మే 6: బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ హైస్కూలులో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో సోమవారం రెండో రోజు ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించారు. 843 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆదివారం 749 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇంకా 543 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. వైసీపీ కార్యకర్తలు తొలిరోజు హడావుడి చేసి... సీఐని తూలనాడడంతో రెండో రోజు సోమవారం పోలీసు బలగాలు భారీగా మోహరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులెవరూ ఫెసిలిటేషన్ కేంద్రం దరిదాపులకు చేరకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. అయినప్పటికీ రెండు



పోస్టల్‌బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో సూచనలిస్తున్న అధికారులు

పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కేంద్రానికి దూరంగా పెద్దఎత్తున గుమికూడారు.

రాజాంలో 775 మంది

రాజాం రూరల్, మే 6: పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఉద్యోగులు పోటెత్తారు. ఇక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఎండను సైతం లెక్క చేయకుండా 775 మంది ఉద్యోగులు హాజరై సోమవారం ఓటు వేశారు. ఈనెల 5న ఆదివారం 746 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్న సంగతి తెలిసిందే. మొత్తం రెండు రోజుల్లో ఓటు వేసిన వారి సంఖ్య 1521కి చేరింది. రాజాం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి 1741 ఓట్లకు గాను 1,521 ఓట్లు పోలయ్యాయి. రాబోయే రెండు రోజుల్లో మరో 220 మంది ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకోవలసి ఉంది. ఇదిలా ఉంటే.. ఎన్నికల పరిశీలకులు తలాట్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్లా ఫెసిలిటేషన్ సెంటర్‌ను సోమవారం పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ తీరుతో పాటు ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే విధానాన్ని పరిశీలించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్ చర్యలు తీసుకున్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ఓటింగ్ సరళిని పరిశీలించారు. తహసీల్దార్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

ఎస్.కోటలో 787 ఓట్లు

శృంగవరపుకోట, మే 6: శృంగవరపుకోట ఫెసిలిటీ సెంటర్‌లో సోమవారం 787 పోస్టల్ ఓట్లు పోలయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి గ్రామ సచివాలయ ఉద్యోగులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు ఓటేసేందుకు ఎక్కువగా వచ్చారు. వైసీపీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావుతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చి... ఫెసిలిటేషన్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో తచ్చాడడం విమర్శలకు తావిచ్చింది. ఓటేసేందుకు వచ్చిన ఉద్యోగులతో పాటు పోలింగ్ కేంద్రం వరకు వీరంతా వెళ్లడంపై అసహనం వ్యక్తమైంది.



ఎస్.కోట ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులు

తాగునీటికి ప్రాధాన్యమిస్తా

- సూపర్ సిక్స్ హామీలు అందరికీ అందేలా కృషి
- అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు
- కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరువలేనిది
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు



విజయనగరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజు

(విజయనగరం రూరల్)

'వైసీపీ ఐదేళ్ల పాలన ప్రజా వ్యతిరేకంగా సాగింది. ఒక్క అవకాశం అంటూ గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను అధోగతి పాలు చేశారు. అన్ని వర్గాలను మోసం చేశారు. ఏటా జాబ్ క్యాలెండర్ అని ప్రకటించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటన లేదు. పోనీ ఎన్నికల ఏడాది జనవరిలోనైనా ఇస్తారేమోనని అందరూ ఆశగా చూశారు. అదీ లేదు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు. మరోవైపు వారి జీవితాలను నాశనం చేసేందుకు వీలుగా విజయనగరాన్ని గంజాయికి అడ్డాగా మార్చేశారు..' అని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. తనను విజయనగరం ప్రజలు గెలిపిస్తే.. చేపట్టబోయే పనులను, ప్రాధాన్యాంశాలను 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

తాగునీటికి తొలి ప్రాధాన్యం

పూసపాటి వంశీయురాలు అప్పలకొండమాంబ విజయనగరం ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు 1913లో మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. ఆ తరువాత మా తండ్రి పూసపాటి అశోక్ గజపతిరాజు ముషిడిపల్లి వాటర్ స్కీంను తీసుకువచ్చారు. నగర జనాభా పెరిగింది.. దీనికి అనుగుణంగా తాగునీరు లభ్యత లేదు. మరో మంచి పథకాన్ని తీసుకురావలసి ఉంది. విజయనగరం ప్రజలకు రోజూ 25 ఎంఎల్‌డీ (మిల్లీ లీటర్ ఫర్ డే') అవసరం ఉంది. ఎమ్మెల్యేగా విజయం సాధించగానే.. కూటమి ప్రభుత్వం దృష్టికి మంచినీటి సమస్యను తీసుకెళతా. నగర జనాభా.. భవిష్యత్తు అవసరాలను అనుసరించి తాగునీటి ప్రాజెక్టు గురించి వివరించి...భవిష్యత్ తరాలకు మంచినీటికి ఇబ్బంది లేకుండా చేస్తాను.

సూపర్ సిక్స్‌పై దృష్టి

టీడీపీ అధినేత చంద్రబాబు పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ పథకాలు సంబంధిత వర్గాలకు అందేవిధంగా చిత్తశుద్ధితో కృషి చేస్తాను. మహిళల కోసం మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పేరిట చదువుకునే ప్రతి విద్యార్థికి రూ.15వేల ఆర్థిక సాయం, రైతులకు వ్యవసాయం చేసుకునేందుకు వీలుగా ఆర్థిక సాయం, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు... ఐదేళ్ల కాలంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన సూపర్‌సిక్స్‌లో ఉంది. వాటిని సక్రమంగా అమలయ్యేలా చూస్తాను.

మౌలిక వసతులకు...

నగర పరిధిలోని అన్ని డివిజన్లు, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాను.. 'భవిష్యత్తుకి భరోసా' యువగళం, ప్రస్తుతం ఎన్నికల ప్రచారం... ఈ విధంగా విరామం లేకుండా గత ఆరు నెలలుగా మండలంలోని అన్ని గ్రామాలలో మూడు పర్యాయాలు... నగరంలోని అన్ని డివిజన్లలో మూడు పర్యాయాలు పర్యటించాను. ప్రజలు సమస్యలతో ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. వారి సమస్యలు తెలుసుకున్నాను. మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తాను. చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాను.

సమస్యలు తెలుసుకున్నా

నగరంలోని 50 డివిజన్లు, మండల పరిధిలోని 22 గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు ఇవ్వాలని కోరాను. ఐదేళ్ల ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా ప్రజలంతా కూటమికి మద్దతు ఇస్తున్నారు. నేను పర్యటించే సందర్భంలో అన్ని వర్గాల ప్రజలతో మమేకమయ్యాను. వారి మాటలు...సమస్యలు విన్నాను. కష్టాలు తెలుసుకున్నాను. ఎమ్మెల్యేగా విజయం సాధించిన వెంటనే ప్రజా సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తాను. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించి.. విజయనగరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాను. దీనికి అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటాను. కుటుంబ సభ్యులు అశోక్ గజపతిరాజు, సునీలా గజపతిరాజు, విద్యావతి దేవి, ఇతర కుటుంబ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిది. వారి ప్రోత్సాహం వెలకట్టలేనిది. మండుటెండలో నాతో వారంతా ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీ అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడుని గెలిపించేందుకు శ్రమిస్తున్నారు.

ఓటర్లు ఆలోచించాలి

ఈ నెల 13న పోలింగ్ జరుగనుంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనది. దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోండి. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించేవి. ఐదేళ్లలో వైసీపీ అరాచక, రాక్షస పాలన సాగింది. అన్ని వర్గాల వారు బాధలు అనుభవించారు. తిరిగి అదే పార్టీకి ఓటేస్తే ఇంకా నష్టం జరుగుతుంది.. ఆలోచించి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించండి. సమర్థుడైన నాయకుడు చంద్రబాబు లాంటి వారు ఈ రాష్ట్ర అభివృద్ధికి, భవిష్యత్ తరాలకు ఎంతో అవసరం. ఆయన సేవలు రాష్ట్రానికి మేలు చేస్తాయి. అందుకే టీడీపీని గెలిపించాలని కోరుతున్నా.



గరివిడి: దువ్వాంలో మహిళలతో చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కళా వెంకటరావు



బొబ్బిలిలో యువ ఓటరుతో కరచాలనం చేస్తున్న బేబీనాయన



రేగిడిలో కోండ్రుకు హారతులిస్తున్న మహిళలు

సందడిగా ప్రచారం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పల్లెల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. సోమవారం వివిధ నియోజకవర్గాల అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరి ప్రచారానికి జనం నుంచి మంచి స్పందన లభిస్తోంది. గరివిడి మండలం దువ్వాంలో చీపురుపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళా వెంకటరావు, పూసపాటిరేగ మండలం చింతపల్లిలో నెల్లిమర్ల జనసేన పార్టీ అభ్యర్థి నాగమాధవి ప్రచారం చేశారు. సీతానగరం మండలం రామవరంలో పార్వతీపురం టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్ర... సీతంపేట మండలం లక్కాయిగూడలో జనసేన అభ్యర్థి జయకృష్ణ ప్రచారంలో పాల్గొన్నారు. గరుగుబిల్లి మండలం సంతోషపురంలో కురుపాం టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి ప్రచారం చేశారు. సాలూరు మండలంలో టీడీపీ అభ్యర్థి సంధ్యారాణి, రేగిడిలో రాజాం టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళి...బొబ్బిలిలో టీడీపీ అభ్యర్థి బేబీనాయన ప్రచారంలో పాల్గొన్నారు. వీరికి మహిళలు హారతులిచ్చారు. కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు.



సాలూరు రూరల్: ప్రచారం చేస్తున్న సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి



గరుగుబిల్లి: సంతోషపురంలో కురుపాం టీడీపీ అభ్యర్థి జగదీశ్వరి ప్రచారం



సీతంపేట: లక్కాయిగూడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జయకృష్ణ



పూసపాటిరేగ: చింతపల్లిలో నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి నాగమాధవి..



సీతానగరం: రామవరంలో ప్రచారం చేస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర

కోలగట్ల అవినీతికి అంతే లేదు: అదితి



37 వ డివిజన్‌లో అదితి గజపతిరాజు ప్రచారం

విజయనగరం రూరల్: వైసీపీ తరపున ఎన్నికల బరిలో ఉండి 'పార్టీని చూడొద్దు.. నన్ను చూడండి' అంటూ కోలగట్ల వీరభద్రస్వామి ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 37వ డివిజన్ పరిధిలోని బీసీ కాలనీ, గాంధీపార్కు ఏరియా, కోటా పార్క్ ఏరియా, మజ్జులవీధి, రామాలయం ఏరియా, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యే వీరభద్రస్వామి చేయని అవినీతి లేదని, ఆయన అనుచరులు నగరంలో భూ కబ్జాలకు పాల్పడ్డారని, సెటిల్‌మెంట్లు చేస్తూ కాలం గడిపారన్నారు. నిరుపేద, పేద, మధ్య తరగతి వారికి ఇళ్ల పట్టాలు అంటూ హడావిడి చేశారన్నారు. ఆ ఇళ్ల పట్టాల్లో చాలా పట్టాలు నకిలీవిగా వున్నాయన్నారు. విజయనగరంలో శాశ్వత అభివృద్ధి అనేది అశోక్ హాయంలోనే జరిగిందన్నారు. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం అన్ని వర్గాలను నాశనం చేసిందని, విద్యలనగరంగా ఉన్న విజయనగరాన్ని గంజాయికి అడ్డాగా మార్చారన్నారు. విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెంచారని, గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తుల ధరలూ అదే స్థాయిలో పెరిగాయన్నారు. టీడీపీ నాయకులు కంది మురళీనాయుడుతో పాటు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజుకి లారీ ఓనర్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.రాజేష్ రాజు, అమర శ్రీనివాసరావు తదితరులు సోమవారం పార్టీ కార్యాలయానికి వెళ్లి టీడీపీ సీనియర్‌నేత అశోక్ గజపతిరాజుని, అదే విధంగా అదితి గజపతిరాజును కలిసి ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

ఒక్క అవకాశం ఇవ్వండి: నాగమాధవి

పూసపాటిరేగ: నెల్లిమర్ల నియోజకవర్గ ప్రజలు తనకు ఒక్క అవకాశం ఇచ్చినట్లయితే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని కూటమి నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. పూసపాటిరేగ మండలంలోని చౌడవాడ, తిప్పలవలస, వెళ్దూరు, చింతపల్లి గ్రామాల్లో ఆమె సోమవారం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. భారీ ర్యాలీగా ఆమె గ్రామంలో పర్యటించారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల వారికి తీవ్ర అన్యాయం జరిగిందని, అభివృద్ధి ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి మేనిఫెస్టోను అందరికీ వివరించారు. తాము అధికారంలోకి వస్తే పేదలకు చేయబోయే మేలు, అందించబోయే సంక్షేమం గురించి అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రచారానికి వచ్చిన ఆమెకు స్థానికులు విశేష స్వాగతం పలికారు. హారతులిచ్చి ఆశీర్వదించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ప్రచారంలో పాల్గొన్నారు.

తిప్పలవలసలో పెద్ద ఎత్తున చేరికలు

పూసపాటిరేగ మండలంలో తిప్పలవలస గ్రామానికి చెందిన 150 కుటుంబాలు వైసీపీని వీడి జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీకి చెందిన 10వ వార్డు మెంబరు సురపతి దుర్గయ్యతో పాటు పలువురు లోకం నాగమాధవి ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు.



తిప్పలవలసలో పార్టీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న నాగమాధవి

టీడీపీ వస్తేనే భవిష్యత్తు: బేబీనాయన



తెర్లాం: మాట్లాడుతున్న బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన పట్టణంలోని 10, 11, 12 వార్డులలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సోమవారం జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, బీజేపీ, జనసేన ఇన్‌చార్జిలు మరిశర్ల రామరావునాయుడు, గిరడ అప్పలస్వామి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ జగన్ అరాచకపాలనకు చరమగీతం పాడే సమయం వచ్చేసిందన్నారు. నాగార్జున, తెంటు మాట్లాడుతూ వైసీపీ దుష్టపాలనను అంతమొందించేందుకు ఓటు అనే ఆయుధాన్ని వినియోగించాలన్నారు. టీడీపీ నాయకులు రాంబార్కి శరత్‌బాబు, రౌతు రామ్మూర్తి, పువ్వల శ్రీనివాసరావు, సజ్జా వెంకటరావు, సుంకరి సాయిరమేష్, బొత్స అప్పులు, కళ్యంపూడి సత్యనారాయణ, దాసరి సురేష్, తెలుగు మహిళా నాయకులు, వీరమహిళలు, కనకమహేశ్ పట్నాయక్, కంచి వెంకటరావు, బొబ్బాది తవిటినాయుడు, ఏగిరెడ్డి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ● **తెర్లాం:** గంగన్నపాడు, జన్నివలస, కూనాయవలస, యం.ఆర్. అగ్రహారం, పెరుమాలి గ్రామాల్లో బేబీనాయన సోమవారం ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి తమకు మద్దతు తెలపాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకట నాయడు, వెంకటేశ్వర రావు, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ● **రామభద్రపురం:** బేబీనాయన ఆదివారం రాత్రి కోటశిర్లాం పాడివానివలస, కొత్తరేగ, మామిడివలస గ్రామాల్లో ఎన్నికల శంఖారావంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంతకుముందు కొత్తరేగ గ్రామంలో సర్పంచ్ కిలపర్తి మురళీ ఆధ్వర్యంలో బేబీనాయనకు భారీ స్వాగతం లభించింది.

రానున్నది రామరాజ్యం: కళా వెంకటరావు



దువ్వాంలో ఎన్నికల ప్రచారంలో కళా వెంకటరావు

గరివిడి: రాష్ట్రంలో రావణ రాజ్యం పోయి, రామరాజ్యం రానున్నదని కూటమి చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండలంలోని తొండ్రంగి, దువ్వాం, దుమ్మెద తదితర గ్రామాల్లో ఆయన సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయాన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీయే రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని అన్నారని ఎద్దేవా చేశారు. జగన్మోహన్‌రెడ్డి పరిపాలన వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో ఏ వర్గానికీ న్యాయం జరగలేదని, కేవలం వైసీపీ నాయకులే లబ్ధి పొందారని తెలిపారు. ఈ ఐదేళ్ల పాలనలో విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెంచారని, గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తుల ధరలూ పెరిగాయని, సాధారణ ప్రజలు బతకడమే చాలా కష్టంగా మారిందన్నారు. చంద్రబాబు వస్తేనే ఈ వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టగలరని, మన రాష్ట్ర భవిష్యత్తును కాపాడతారని, అందుకే బాబును గెలిపించుకోవడం చాలా అవసరమన్నారు. అనంతరం గరివిడి డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల కేంద్రాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునతో కలిసి ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల నాయకులు పైల బలరాం, బలగం వెంకటరావు, ఎజ్జిపురపు సత్యం, సారిపాక సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి పనిచేయాలి: కోండ్రు

రాజాం మే 6 టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేసి చేయాలని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ కోరారు. సోమవారం పురపాలక సంఘం పరిధిలోని 20 వార్డుకు చెందిన 15 ఎస్సీ కుటుంబాలు రేగిడి మండలం అంబాడ వెంకటాపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు సంతకవిటి మండలం అప్పల అగ్రహారం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వంగర మండలం కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైసీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని సాదరంగా ఆహ్వానించి టీడీపీ కుండువా వేశారు.

● సంతకవిటి మండలం గుళ్లసీతారాంపురం. ఎస్ రంగరాయపురం. తాలాడ. సురవరం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు మహిళలు అడుగడుగునా మంగళ హారతులతో పూలవర్షం కురిపించి ఘనస్వాగతం పలికారు. పార్టీ నాయకులు కొళ్ల అప్పలనాయుడు, గట్టి భాను, వల్లూరు గణేష్, పారినాయుడు. సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలో రేగిడి, అమదాలవలస, కొర్లవలస, బూరాడ గ్రామాల్లో సోమవారం సాయంత్రం కోండ్రు మురళీ నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది. గ్రామాల్లో కోండ్రు భారీ ర్యాలీ నిర్వహించి ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ హామీలు , బిసి డిక్లరేషన్‌పై ప్రజలకు వివరించారు.



రాజాం: పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న కోండ్రు మురళీమోహన్

జిల్లాలోని సమస్యలు పరిష్కరించండి

● ప్రధాని మోదీకి వినతి పత్రం ఇచ్చిన కలిశెట్టి అప్పలనాయుడు



ప్రధాని మోదీతో కలిసి వేదికపై కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం-ఆంధ్రజ్యోతి: మళ్లీ గెలిచి ప్రధాని అయ్యాక జిల్లాలో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రధాని మోదీకి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు వినతిపత్రం అందించారు. కూటమి తరుపున ఎన్నికల ప్రచారం కోసం సోమవారం ప్రధాని మోదీ అనకాలిపల్లి వచ్చారు. సోమవారం జరిగిన ఎన్నికల సభ అనంతరం ప్రధాని దృష్టికి ఈ ప్రాంత సమస్యలను విజయగనరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు తీసుకు వెళ్లారు. రైతులకు ఎంతో ఉపయోగకరమైన తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు, తారకరామ తీర్థసాగర్, మడ్డువలస ప్రాజెక్టు వంటి సాగునీటి ప్రాజెక్టులకు నిధులు అందించి సహకరించాని కోరారు. జిల్లాలో మూతపడిన బొబ్బిలి, భీమసింగి చక్కెర కర్మాగారాలను తెరిపించి చెరకు రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లాలో సముద్ర తీరం ఉన్నందున మినీ జట్టీలు, కోల్డు స్టోరేజీలను మత్స్యకారులకు అందించాలని, స్కిల్ డవలెప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. 100 పడకల స్థాయి ఆసుపత్రులను బొబ్బిలి, గరివిడి, పైడిభీమవరం పారిశ్రామిక వాడల్లో ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో జిల్లాకు మంజూరైన గిరిజన విశ్వవిద్యాలయం పూర్తి చేస్తే ఈ ప్రాంత గిరిజన, గిరిజనేతర విద్యార్థులకు అనువుగా ఉంటుందని, జూట్ ఫ్యాక్టరీలు నిలదొక్కుకునేందుకు వీలుగా జూట్ కార్పోరేషన్ అఫ్ ఇండియాను బలోపేతం చేయాలని కోరారు. రైల్వే ఫ్లైఓవర్ వంతెనలు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని వినతి పత్రంలో కోరారు.

యువగళాన్ని విజయవంతం చేయండి

విజయనగరం రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి ఆదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. సోమవారం సభ జరిగే అయోధ్య మైదానంలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మంగళవారం విజయనగరం వస్తున్నారన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

గజపతినగరం: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా పోస్టల్ ఓటు వినియోగించుకునేందుకు మరో రెండు రోజులు అవకాశం కల్పిస్తున్నట్టు ఆర్వో ఎం.వీ సూర్యకళ అన్నారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గానికి సంబంధించి 1,824 మంది పోస్టల్ ఓట్లు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వం 5, 6 తేదీల్లో ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించినప్పటికీ ఉద్యోగులు పూర్తిస్థాయిలో ఓటు వినియోగించుకునేందుకు మరో రెండు రోజులు అవకాశం కల్పించామని చెప్పారు. ప్రతిఓటరూ తమ ఓటును వినియోగించుకోవాలన్నదే తమ లక్ష్యమన్నారు.

24 మంది రక్తదానం

చీపురుపల్లి: పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 24 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సమన్వయకర్త బీవీ గోవిందరాజులు మాట్లాడుతూ రక్తదానం ప్రాణ దానంతో సమానమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాద్, డా.సూర్య, రమ, హరి, ప్రసాద్, మేనేజింగ్ మెంబర్ రెడ్డి రమణ, అప్పారావు, యువత పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

రామభద్రపురం: మండల పరిధిలోని బూసాయవలస గ్రామంలో మడక శ్రీదేవి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు ప్రారంభించారు. ఏటా ఈ టోర్నమెంట్ నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ వస్తోంది. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడాకారులు విజయవంతంగా ఈ టోర్నమెంట్‌ను ముగించాలని కోరారు. అనంతరం మొదటిరోజు తలపడిన బొబ్బిలి, కొండకెంగువ క్రికెట్ టీంలను పరిచయం చేసుకున్నారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర నాయకులు కనిమెరక శంకరరావు, బూసాయవలస సర్పంచ్ ప్రతినిధి గంటా సాయికుమార్, యాండ్రాపు మధు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు లొంగవద్దు

బొబ్బిలి: అధికార వైసీపీ నాయకుల వేధింపుల నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన కోరారు. సోమవారం గొల్లపల్లిలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు పోస్టల్‌బ్యాలెట్‌లో ఎవరికి ఓటు వేశారో మొబైల్‌ఫోన్‌లో చూపించాలని బెదిరిస్తున్నారని ఇది చాలా దారుణమన్నారు. ప్రతి ఓటరు తమ ఆత్మసాక్షిగా నచ్చిన వారికి ఓటువేయాలని బేబీనాయన కోరారు.

సక్రమ ఎన్నికలకు సహకరించాలి

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికలు సక్రమంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని సీఐ ఎస్.తిరుమలరావు కోరారు. మండలంలోని నాయుడువలస గ్రామంలో సోమవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విస్తృతంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో వివాదాలు, తగవులు సృష్టించేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

దుష్టపాలనకు చరమగీతం పాడండి

రాజాం రూరల్: వైసీపీ దుష్ట పాలనకు చరమగీతం పాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కొల్ల అప్పలనాయుడు పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డి అయిదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలయ్యిందని స్పష్టం చేశారు. కోండ్రు మురళీమోహన్‌కు మద్దతుగా తెదేపా శ్రేణులతో కలిసి సంతకవిటి మండల పరిధిలోని కృష్ణంవలసలో సోమవారం రాత్రి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు.

సంక్షేమం పేరుతో దోపిడీ

శృంగవరపుకోట రూరల్: వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో ఈ రాష్ట్ర ప్రజలను సంక్షేమ పథకాలతో దోచుకున్న తీరును ఐదుకోట్లు ఆంధ్రులు గుర్తించారని వారికి ఓటువేయవద్దని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని వసి గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి సుధారాజు ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

లక్కవరపుకోట: కొత్తవలస పట్టణానికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి సమక్షంలో వీరంతా టీడీపీలో చేరారు. ఇందుకూరి సుధారాజుతో పాటు కొత్తవలస నేతలు బాబీ, కొల్లి కృష్ణ తదితరులు పాల్గొ న్నారు.

రాజాం: సంకతవిటి మండలం తలతంపర, బిళ్లాని గ్రామంలో నియోజకవర్గ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు బెహరా తవుడు అధ్యక్షతన సోమవారం 40 మత్స్యకార కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి రాష్ట్ర మాజీ తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొళ్ల అప్పలనాయుడు టీడీపీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

విద్యావతీ దేవి ప్రచారం

విజయనగరం రూరల్: విజయనగరంలోని 43వ డివిజన్‌లో అశోక్ గజపతిరాజు కుమార్తె, డాక్టర్ విద్యావతీ దేవి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, అదితి గజపతిరాజును గెలిపించాలని కోరుతూ ఆమె డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లోని ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేయాలని ఆమె అభ్యర్థించారు. ఇంటింటికీ వెళ్లినప్పుడు ఆమెకు హారతులు పట్టారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వమిది

విజయనగరం రూరల్: ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగించిందని, దీని వల్ల రాష్ట్రం, రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున చెప్పారు. సోమవారం నగరంలోని కాటవీధి తదితర ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో టీడీపీ రాష్ట్ర నాయకురాలు కావలి గ్రీష్మతో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, నీతి, నిజాయితీలు, విలువలతో కూడిన రాజకీయం అశోక్ గజపతిరాజు చేశారని, జిల్లా అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు.

ఎన్నికలకు వైద్య సిబ్బంది సిద్ధం: డీఎంహెచ్‌వో

విజయనగరం రింగురోడ్డు, మే 6: సాధారణ ఎన్నికల్లో భాగంగా ఓటింగ్ జరిగే 1,847 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలతో పాటు, సిబ్బందిని కేటాయించామని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు నియోజకవర్గాలకు పోలింగు సామగ్రి అందజేసే కేంద్రాల వద్ద సంబంధిత పీహెచ్‌సీ వైద్యాధికారులతో ప్రథమ చికిత్సా కేంద్రాలను ఈ నెల 12న నిర్వహించనున్నట్టు తెలిపారు. 13న పోలింగు రోజున సంబంధిత కేంద్రాల వద్ద పారామెడికల్ ఉద్యోగులతో పాటు, ఆశా కార్యకర్తలను నియమించనున్నట్టు తెలిపారు. అదే రోజు సాయంత్రం స్ట్రాంగ్ రూం వద్ద జేఎన్‌టీయూ, లెండి కళాశాలల వద్ద రెండేసీ టీంలను వైద్యాధికారి నాయకత్వంతో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ నెల 11 నుంచి 15 వరకూ సెలవులు మంజూరు చేయడం లేదని తెలిపారు.

'శంబంగి తీరు సరికాదు'

బొబ్బిలి: బొబ్బిలి వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే, ప్రస్తుత అభ్యర్థి శంబంగి వెంకట చినఅప్పలనాయుడుపై జైభీమ్‌రావ్ భారత్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మరడాన వెంకటనాయుడు, చిన్నం అరుణ్‌కుమార్‌లు పలు ఆరోపణలు చేశారు. స్థానిక శ్రీ సూర్య రెసిడెన్సీలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెర్లాం మండలం ఉద్దవోలు శంబంగి గెలుపు కోసం ఎంతో శ్రమించామన్నారు. తమను పావులుగా వినియోగించుకుని శంబంగి తమ జీవితాలను నాశనం చేశారని ఆరోపించారు. శంబంగికి టికెట్ ఇవ్వవద్దని జగన్‌కు చాలామంది వైసీపీ నాయకులం కలిసి చెప్పామని, దీంతో నన్ను మా ఊర్లోనికి రానీయకుండా కుట్ర చేస్తున్నార అప్పలనాయుడు అన్నారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

రానున్నది కూటమి ప్రభుత్వమే



బొద్దాంలో లలితకుమరి ప్రచారం

వేపాడ: రాష్ట్రంలో రానున్నది తెలుగు దేశం ప్రభుత్వమేనని శృంగవరపుకోట ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలి తకుమారి అన్నారు. మండలంలోని బొద్దాం, రామస్వామిపేట వీకేఆర్ పురం తదితర గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ● **లక్కవరపుకోట:** అప్పులతో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చంద్రబాబునాయుడే పెద్ద దిక్కని ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ అభ్య ర్థి కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం పోతంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ● **శృంగవరపుకోట:** శృంగవరపుకోట పంచాయతీ శివారు సీతంపేట గ్రామంలో టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ మేనిఫెస్టోను వివరించారు. ఇందుకూరి సుధారాజు, గనివాడ సంతోషి కుమారి, నాయకులున్నారు.

గజపతినగరంలో ప్రచారం



పార్టీలో చేరిన వారితో శ్రీనివాస్

దత్తిరాజేరు: గజపతినగరంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఉప సర్పంచ్ మామిడి గౌరి, వార్డు మెంబర్లు గెద్ద సత్యనారాయణ, తెర్లపు పైడిరాజు తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

గజపతినగరం: దావాలపేట గ్రామానికి చెందిన వలంటీర్ మామిడి సతీష్ సోమవారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన ఎం.గుమడాం, బూడిపేట, తమ్మారాయుడుపేట, గుడివాడ గ్రామాల్లో పర్యటించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పాలు, నీటితో అభిషేకం చేస్తున్న దృశ్యం

గజపతినగరం: స్థానిక సీతారామ స్వామి గ్రూపు దేవాలయంలోగల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలయ అర్చకుడు రాంబాబు ఆధ్వర్యంలో 1008 కొబ్బరికాయలతో అభిషేకం తోపాటు వెయ్యి బిందెల పాలు, నీరుతో మహిళలు అభిషేకం నిర్వహించారు. లోక కల్యాణార్థం సకాలంలో వర్షాలు పడాలని, భూతాపం తగ్గించాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేపట్టినట్టు అర్చకులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల పరిశీలన

నెల్లిమర్ల: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో జి.రామారావు సోమవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లోని పోలింగ్ రోజున అవసరమయ్యే మౌలిక సదుపాయాల కల్పనపై పంచాయతీ కార్యదర్శులకు, బూత్ లెవెల్ అధికారులకు పలు సూచనలు చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా ఉద్యోగులు వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. మండలంలోని టెక్కలి, కొండవెలగాడ, చంద్రంపేట, తాళ్లపూడిపేట, చినబూరాడపేట, పెదబూరాడపేట, పారసాం, కొండగుంపాం, గరికిపేట, పూతికపేట, మొయిద, కొత్తపేట, గొర్లెపేట, సీతారామునిపేట, రామతీర్థం, సారిపల్లి, కుదిపి, జగ్గరాజుపేట గ్రామాల్లోని పోలింగ్‌కేంద్రాలను ఆయన సోమవారం సందర్శించారు.

వైసీపీ కోట బద్దలవ్వడం ఖాయం

రేగిడి: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలుపుతో వైసీపీ కోట బద్దలవ్వడం ఖాయం అని రాజాం టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీ, జనసేన పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పాలవలస యశస్వినీ పేర్కొన్నారు. రేగిడి గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ మే 13న నిర్వహించిన ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయనగరం క్రైం: విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో 2020 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో విజయనగరం మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన కళ్లేపల్లి అప్పారావు(61)కి ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయాధికారి కె.నాగమణి 20ఏళ్లు కఠిన కారాగారం, రూ.2,500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పును ఇచ్చారని రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడు ఐదేళ్ల బాలికపై లైంగిక నేరానికి పాల్పడినట్టుగా రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ తీర్పును వెల్లడించారు. విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు పర్యవేక్షణలో విజయనగరం రూరల్ ఎస్ఐ ఆర్.వాసుదేవరావు, కోర్టు ఉమెన్ కానిస్టేబుల్ టి.లక్ష్మి, హెచ్.రామకృష్ణ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరిచారన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

శృంగవరపుకోట రూరల్ /జామి: ఎస్.కోట మండల కేంద్రంలోని జీసీసీ రోడ్డులో, జామి మంగలి వీధిలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఫణీంద్రబాబు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సంతోష్ ఆదేశాల మేరకు సోమవారం దాడులు చేపట్టామన్నారు. ఈ దాడుల్లో ఎస్.కోట జీసీసీ రోడ్డులో స్కూటీలో పది మద్యం సీసాలు తరలిస్తూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడని చెప్పారు. అలాగే జామి మంగల వీధిలో పది మద్యం సీసాలు తరలిస్తూ మరో వ్యక్తి పట్టుబడ్డాడని తెలిపారు. వీరిద్దరిపై కేసులు నమోదు చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

రాజాం రూరల్: మండల పరిధిలోని గురవాం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు గాయపడినట్లు ఏఎస్.ఐ. భాస్కరరావు తెలి పారు. వీరంతా రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆయన వివ రించారు. ఆయన అందించిన సమాచారం ప్రకారం రాజాం నుంచి పాలకొండ వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను వెనుకనుంచి మితిమీరిన వేగంతో వచ్చిన ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమా దంలో ఆటో డ్రైవర్ మురళితో పాటు ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఆటో డ్రైవర్ మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భాస్కరరావు తెలిపారు.